క్లుప్తంగా

'కొఠారు కుటుంబానికి రుణపడి ఉంటా'



మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న జెడ్పీటీసీ దంపతులు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు కుటుంబాలకు తమ కుటుంబం రుణపడి ఉంటుందని దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలా నవకాంతం, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంగరాజు అన్నారు. శనివారం జోగన్నపాలెంలో విలేకరులతో మాట్లాడుతూ నాలుగేళ్ల కిందట ఇదే రోజున దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలిగా అవకాశం కల్పించారన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీతో పాటు పార్టీ శ్రేణులు, ప్రజలు ఆదరించడంతో జెడ్పీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యానని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో అబ్బయ్య చౌదరిని దెందులూరు ఎమ్మెల్యేగా, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశామన్నారు.

ప్రపంచ శాంతికి నిరంతర కృషి



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న లయన్స్ లియోక్లబ్ సభ్యులు

గణపవరం: సమాజంలో శాంతి నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని లయన్స్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణ మూర్తి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్ అన్నారు. శనివారం ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా గణపవరంలో లయన్స్, లియో క్లబ్‌ల ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులతో శాంతి ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెల్లంకి నరేష్, కార్యదర్శి కిలారి రవిబాబు లయన్స్‌సభ్యులు అడబాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో జోరు వాన



వర్షానికి ఛిద్రమైన రోడ్లు

దెందులూరు: గ్రామగ్రామాన శనివారం సాయంత్రం కురిసిన జోరువానకు రోడ్లు చిత్తడిగా మారాయి. గుంటలు పడిన రోడ్లు వర్షపు నీటితో నిండిపోయి ప్రయాణానికి తీరని ఇబ్బందిగా మారాయి. ఈదురు గాలులు జోరువాన నాలుగున్నర గంటలసేపు గ్రామాలను అతలాకుతలం చేసింది. పాదచారులు, ప్రయాణికులు, రైతులు, కూలీలు ఎక్కడ వారు అక్కడే చెట్లు షాపులు బ్రిడ్జిలు కింద నాలుగున్నర గంటలసేపు నిలిచిపోయారు. దెందులూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం రోడ్డు, మాజీ సర్పంచ్ తొత్తడి వేదకుమారి రోడ్డు నడవడానికి వీలులేని విధంగా అధ్వానంగా తయారయ్యాయి. మరోపక్క ఈ నెలలోనే అనేకసార్లు కురిసిన వర్షాలు తమ చేలకు నష్టమే కలుగుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు వినతి

లింగపాలెం: ధర్మాజీగూడెంలో బస్టాండ్ ఆక్రమణకు గురైందని, మల్ల సముద్రం, పెద్ద చెరువు ఆక్రమణకు గురైందని వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఏలూరు బీజేపీ కార్యదర్శి కుర్ర వెంకట సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం లింగపాలెం హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ వెట్రిసెల్వికి ఆయన వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

కేజీబీవీ విద్యార్థులు చదువుల్లో రాణించాలి



ప్రసంగిస్తున్న పంకజ్‌కుమార్

కుక్కునూరు: కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అదిరోహించాలని ఎడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పంకజ్ కుమార్, సీఈఓ కేఎస్ ప్రభాకర్ సూచించారు. శనివారం వారు మండలంలోని కేజీబీవీ పాఠశాలలను పరిశీలించి విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దని, పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ఆ రెండు హామీల మాటేంటి బాబూ?

- సూపర్ సిక్స్–సూపర్ హిట్ అంటూ కార్యక్రమాలు
- నిరుద్యోగభృతి, ఆడబిడ్డ నిధి మాటే ఎత్తని వైనం



దెందులూరు: ఇంటికోఉద్యోగం వచ్చేంతవరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు, సూపర్‌సిక్స్‌లో భాగంగా ఆడబిడ్డ నిధి పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఆర్థికసాయం ఇస్తానంటూ ఎన్నికల సమయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా నిరుద్యోగభృతి, ఆడబిడ్డ నిధిపై నోరు మెదపకపోవడంపై నిరుద్యోగులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువతీయువకులకు భారీ సంఖ్యలో కొలువులు వస్తాయని, లేదంటే నిరుద్యోగభృతి, ఆడబిడ్డ నిధి అందుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ రెండు హామీలు నెరవేర్చకుండానే సూపర్ సిక్స్–సూపర్ హిట్ అంటూ టీడీపీ నేతలు కార్యక్రమాలు నిర్వహించడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

పీ–4 పేరుతో కలరింగ్

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు ప్రతినెలా రూ.1500 చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా ఆ హామీ ఆచరణకు నోచుకోవడం లేదు. కుట్రలో భాగంగా పీ–4 పథకంలో ఈ ఆడబిడ్డ నిధిని తోసేసి ఇచ్చానన్నట్లు కలరింగ్ ఇచ్చి మహిళలను బాబు నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాల కోసం ఆవేదన

మండలంలో డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు బీఈడీ, టీటీసీ, ఇంటర్మీడియట్, పదో తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం ఆశ పడేవారు 3 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు తమ ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నట్లు ప్రకటించారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3వేలు భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో ప్రచారం చేశారు. దీంతో నిరుద్యోగులు ఎంతో ఆశతో ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్నారు.అయితే కూటమి ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండడంతో పాటు నిరుద్యోగ భృతి గురించి మాట్లాడడంతో లేదని నిరుద్యోగులు వాపోతున్నారు.

సూపర్ సిక్స్ అరకొర అమలు

సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలన్నింటినీ అరకొరగా అమలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లికి వందనం కూడా కోతలు లేకుండా రూ.15 వేలు ఇస్తానని చెప్పి లబ్ధిదారులను తగ్గించేసి రూ.13 వేలతో సరిపెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కూడా ఏడాది తర్వాత మొదలు పెట్టారని, కేంద్రం ఇచ్చే డబ్బుతో కాకుండా రూ.20 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కేంద్ర సాయంతో కలిపి రూ.20 వేలు అని మాట మార్చారని రైతులు చెబుతున్నారు. ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు సిలిండర్లు అని చెప్పారని, కానీ సిలిండర్లకు ముందు డబ్బు చెల్లిస్తే తర్వాత తీరిగ్గా అవి వేస్తామని సెలవిస్తున్నారని, అవి కూడా కొందరికి పడడం లేదని మహిళలు వాపోతున్నారు. ఉచిత బస్సు ప్రయాణంకూడా అన్ని బస్సులకు అమలు చేయకుండా కోత పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూపర్ సిక్స్–సూపర్ హిట్ కాదని సూపర్ సిక్స్– మొత్తం తుస్ అని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలి



నిరుద్యోగభృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. ఒక్క నెల నోటిఫికేషన్ ఆలస్యమైనా ఉద్యోగానికి లక్షలాది మంది వయోపరిమితి దాటి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇవ్వాలి. లేకుంటే నిరుద్యోగభృతి అమలు చేయాలి.

– కత్తుల రవి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

మాట నిలుపుకోవాలి



కూటమి ప్రభుత్వం నిరుద్యోగభృతి మాట నిలుపుకోవాలి. ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తి అయినా దీనిపై సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి లోకేష్ ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీనిపై మాలాంటి నిరుద్యోగుల్లో అనుమానం కలుగుతోంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వాలి.

– గొల్ల కిరణ్, నిరుద్యోగి

ఆడబిడ్డ నిధి సంగతేంటి?



ప్రతి నెలా 18 ఏళ్లు నిండి ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఎన్నికలు అయిపోయి ప్రభుత్వం ఏర్పడింది. దాదాపు 14 నెలలు పూర్తయ్యాయి. నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డలు అందరూ నష్టపోయారు. ఆడబిడ్డ నిధి సంగతి తేల్చాలి.

– రాజేశ్వరి, దెందులూరు

రేపటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం



గోపన్నపాలెంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు

దెందులూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గోపన్నపాలెం శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో దసరా ఉత్సవాలను సోమవారం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని, గ్రామ మాజీ సర్పంచ్, కమిటీ సభ్యులు కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖులు చేతులమీదుగా ఉత్సవాలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అమ్మవారిని 22న శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకరణ, 23న శ్రీ గాయత్రి దేవి అలంకరణ 24న శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణ, 25న శ్రీ వన దుర్గ దేవి అలంకరణ, 26న శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణ, 27న శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణ, 28న శ్రీ మహా చండీ దేవి అలంకరణ, 29న శ్రీ సరస్వతి దేవి అలంకరణ,30న దుర్గాదేవి అలంకరణ, 1న శ్రీ మహిషాసురమర్దని అలంకరణ, 2న శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అలంకరిస్తామన్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు

వర్షం సైతం లెక్కచేయకుండా గ్రామగ్రామాన దసరా ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఓ వైపు వర్షం దంచు కొడుతున్న లెక్కచేయకుండా ఆలయాల నిర్వాహకులు గ్రామాల్లో వీధుల్లో అమ్మవారిని ఏర్పాటు చేసేందుకు ఉత్సాహంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



భీమడోలులో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న దృశ్యం



భీమడోలులో రక్తదానం చేస్తున్న యువకుడు



మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



పెదవేగి: పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో నిర్వహిస్తున్న దృశ్యం



దెందులూరు: వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమడోలు: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పలువురు కోరారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద శనివారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ సతీష్‌లు ప్రారంభించారు. మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్, టీకాలు, రక్తహీనత, దంత, ఆయుష్ సేవలు, మానసిక ఆరోగ్యంపై వైద్య బృందం పరీక్షలు నిర్వహించారు. వివిధ స్పెషలిస్ట్ వైద్యులు వారికి ప్రాథమిక పరీక్షలు చేశారు. పలువురు రక్తదానం చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యమే కుటుంబ, సమాజ ఆరోగ్యమన్నారు. స్త్రీ లేనిదే మానవ మనుగడ లేదన్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు 300 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, ఏఎంసీ చైర్మన్ శేషగిరి, పెద్దలు కరణం పెద్దిరాజు, ప్రత్తి మదన్, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, వై.వాసు, ప్రవీణ్‌కుమార్ పటేల్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం: మహిళల ఆరోగ్యరక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈపథకాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని గణపవరం మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ముత్యాల వేణు అన్నారు. శనివారం గణపవరం మండలం వల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలు నిండిన మహిళలంతా తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, ఏదైనా సమస్య ఉంటే ముందుగానే గుర్తించి, వైద్యం పొందవచ్చునన్నారు. వైద్యాధికారి ఓంకార్‌నాథ్ మాట్లాడుతూ మహిళల్లో రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు నిర్వహించి, వైద్యం అందిస్తారన్నారు. గ్రామ సచివాలయాల పరిధిలోని వెల్‌నెస్ కేంద్రాలలో కూడా వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మహిళల్లో వచ్చే ఆరోగ్యసమస్యలు, రక్తహీనత, పోషకాహారం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వీరేశ్వరపురం, వాకపల్లి సర్పంచ్‌లు అడబాల రవిశంకర్, ఆదిమూలం సురేష్, సీహెచ్‌వో జాలాది విల్సన్ తదితరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో 200 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపి, మందులు అందచేశారు.

పెదవేగిలో..

పెదవేగి: మహిళలు ఆరోగ్యకరంగా ఉంటే బలమైన కుటుంబం నిర్మితమవుతుందని పెదవేగి పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ప్రత్యూష అన్నారు. శనివారం పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో «స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్» కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధుల కోసం మహిళలకు క్షేత్రస్థాయిలో వైద్యపరీక్షలు జరగాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ సీడీపీఓ ఎస్‌కే ఫాతీమున్నిసా బేగం, సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో

దెందులూరు: మహిళలు, బాలికలు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవడంలో నిర్లక్ష్యం వహించకూడదని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు చైతన్య, శాంతకుమారి అన్నారు. శనివారం ఉండ్రాజవరం సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ బొడ్డేటి మోహన్ వైద్య శిబిరాలు ప్రారంభించారు. పోతునూరు పీహెచ్‌సీ స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ వైద్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వ్యాధులను పరీక్షలు చేశారు. ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్, హెల్త్ సూపర్‌వైజర్ హరి, ఎంపీటీసీ సభ్యుడు సున్నా నరేష్, సున్న లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



గణపవరంలో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బాలయ్య

గణపవరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత, 500పైన మార్కుల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. శనివారం గణపవరంలో జరిగిన పాఠశాల సముదాయ సమావేశంలో పాల్గొని ఉపాధ్యాయులకు వివిధ విషయాలపై సూచనలిచ్చారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఏ1 పరీక్షలలో విద్యార్థుల ప్రగతి పరిశీలించి, సీడీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థుల వివరాలు పాఠశాలల వారీగా తెలుసుకుని, వారిని ఏబీ గ్రేడులలోకి చేరే విధంగా ప్రత్యేక బోధన నిర్వహించాలని సూచించారు. ఎఫ్ఏ–2 పరీక్షలు జరిగే నాటికి సీడీగ్రేడు విద్యార్థుల్లో ప్రగతి తప్పనిసరిగా కనిపించాలన్నారు. ప్రతి నెలా నిర్దేశించిన సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించి, వెనుకబడ్డ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు హెచ్‌ఎంలు తెలిపారు. ఈసందర్భంగా మూల్యాంకన పుస్తకాలు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, ఉపాధాయుల హేండ్‌బుక్కులు, టీచర్స్ డైరీలు, పాఠ్యప్రణాళికల తయారీపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎంలు వీరవేణి, తోట అప్పారావు, ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

ఆడ పిల్లలు ఇంటికి వెలుగు



ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు, బాలికలు, సిబ్బంది

భీమడోలు: ఆడపిల్ల లేనిదే భవిష్యత్తు సమాజం అమ్మలేని ఆనాథగా మిగులుతుందని పూళ్ల వైద్యాధికారిణి డాక్టర్ పి.అరుణజ్యోతి అన్నారు. పూళ్ల బాలికల వసతి గృహం వద్ద వైద్యురాలు పి.అరుణజ్యోతి ఆధ్వర్యంలో శనివారం భేటీ బచావో భేటి పఢావో కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం అనే నినాదంతో విద్యార్థినీలు, ఆసుపతి సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆడ పిల్లలేని సమాజం ఊహించుకోలేమన్నారు. మీకు తల్లి, సోదరి, స్నేహితురాలు, భార్య కావాలి కాని ఆడ బిడ్డ అక్కర్లేదా అంటూ నినదిస్తూ పురవీధుల్లో ర్యాలీ చేశారు. ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆడపిల్లలే ఇంటికి వెలుగు అని, ఆడపిల్ల లేని సమాజం అంధకారమన్నారు. ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి ప్రోత్సాహం అందిస్తే మరింత ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ ఎల్.సుహాసిని, హెచ్ఎస్ జి.శ్రీనివాసరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులు ముందస్తు పిచికారీలు చేయవద్దు



వీరేశ్వరపురంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి ప్రసాద్

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దోమలు, తెగుళ్ల వ్యాప్తికి ప్రతిబంధకంగా ఉందని, అందువల్ల రైతులు అవసరంగా పురుగుమందులు ముందస్తుగా పిచికారి చేయవద్దని గణపవరం మండల వ్యవసాయ అధికారి ఆర్‌ఎస్‌ప్రసాద్ సూచించారు. శనివారం గణపవరం మండలం వీరేశ్వరపురం, వాకపల్లి గ్రామాల్లో ఆయన సార్వాపైరును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి సార్వాపైరు సంరక్షణపై పలు సూచనలు ఇచ్చారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందు వల్ల ఎక్కడా దోమబెడద, తెగుళ్లబెడద పెద్దగా లేదని, రైతులు పురుగు మందులు పిచికారి చేయాల్సిన అవసరం లేదన్నారు. వాతావరణ పరిస్థితి ఇలాగే కొనసాగితే దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు అడబాల రవిశంకర్, ఆదిమూలం శ్రీనివాస్, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానంపై రైతుల నిరసన



అధ్వానంగా ఉన్న రహదారిపై రాకపోకలు సాగిస్తున్న రైతులు

కొయ్యలగూడెం: రైతులు ఆరోపించిన విధంగానే పరింపూడి, కన్నాయిగూడెం గ్రామాల మధ్య నూతనంగా నిర్వహిస్తున్న రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల ఎన్‌ఆర్‌ఇజీఎస్ నిధులు రూ.70 లక్షలతో పాత పరింపూడి నుంచి కన్నాయిగూడెం వరకు గ్రావెల్ రోడ్డు మంజూరైంది. కొద్ది నెలల క్రితం నాణ్యతలేని గ్రావెల్‌తో నిర్మిస్తున్నారంటూ రైతులు ఆందోళన చేయడంతో వ్యవహారం బయటికి వచ్చింది. కూటమి నాయకులు సిండికేట్‌గా వ్యవహరించి ఏమాత్రం నాణ్యతలేని ప్రమాణాలతో ఉన్న బంక మట్టిని తీసుకువచ్చి రోడ్డుపై పోసారని రైతులు ఆరోపించారు. నాటి ఆరోపణలకు తగ్గట్టుగా ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి చిత్తడిగా మారి నడవడానికి వీలు లేకుండా మారింది. ఈ నేపథ్యంలో రైతులను బుజ్జగించే ప్రక్రియను కూటమి నాయకులు భుజాన వేసుకుని వారిపై ఒత్తిడి తేవడం ప్రారంభించినట్లు తెలిసింది. అయితే రైతులు మాత్రం ఇప్పటివరకు జరిగిన అవకతవకలపై విచారణ చేసి నాణ్యత కలిగిన గ్రావెల్‌ను వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా మూడు లేయర్లుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది అని మొదటి లేయర్ వరకే పనులు కొనసాగాయని చెప్పారు.

ప్రశ్నించారని బెదిరింపులు

నాణ్యతలేని రహదారి నిర్మాణంపై ప్రశ్నించినందుకు కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ కన్నాయిగూడెం గ్రామానికి చెందిన రైతులు శనివారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. పరింపూడి గ్రామం నుంచి కన్నాయిగూడెం గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రూ.70 లక్షల అంచనాతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను వెచ్చించి గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నట్లు రైతులు మద్దుకూరి సుభాష్ చంద్రబోస్, మద్దుకూరి వరప్రసాద్ పేర్కొన్నారు. రోడ్డు నాణ్యతతో నిర్మించాలని కోరగా, కాంట్రాక్టర్, అతని తమ్ముడు తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇటీవల తాము పొలం నుంచి వస్తూ ఉండగా కాంట్రాక్టర్, అతని తమ్ముడు తమపై కర్రలు విసిరి పారిపోయారని, తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో జీఆర్ మనోజ్



దెందులూరు: మొక్కలు నాటుతున్న తహసీల్దార్ విజయకుమార్‌రాజు

ఉంగుటూరు: మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని పలువురు వక్తలు తెలిపారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉంగుటూరు ఎంపీడీవో, నారాయణపురం ప్రత్యేక అధికారి జీఆర్ మనోజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని తద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. అనంతరం నారాయణపురం సచివాలయం–2 ప్రాంగణంలో సర్పంచ్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం స్థానిక సర్పంచ్ అలకనంద గ్రామస్తులు చేత స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దెందులూరు: పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఏలూరు రూరల్ తహసీల్దార్ జి.వి జయకుమార్ రాజు అన్నారు. శనివారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర పనులను ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్ని శాఖల ఉద్యోగులతో కలిసి చేశారు. ఫ్లెక్సీలు పట్టుకొని గ్రామంలో అన్ని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. పాఠశాలలో తహశీల్దార్ విజయకుమార్ మొక్కలు నాటారు.

అక్షర ఆంధ్ర విజయవంతం చేయాలి



అభ్యాసకులకు సూచనలు ఇస్తున్న వయోజన విద్యాశాఖ డీడీ ప్రభాకర్

టి.నరసాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. శనివారం టి.నరసాపురంలో ఉన్న మూడు అక్షరాల కేంద్రాలను సందర్శించి అభ్యాసకులకు పలు సూచనలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి నిరక్షరాస్యులైన మహిళలను, ఉపాధి హామీ పథకంలోని పురుషులను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ విద్యలను ప్రతి ఒక్కరూ నేర్చుకుని నేటి తరంతో పోటీ పడాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్ విజయకుమార్ తెలిపారు. మండలంలో 2,400 మంది డ్వాక్రా మహిళలకు, ఉపాధి హామీ పథకంలోని 1000 మంది పురుషులను అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో వలంటరీ టీచర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మందుల దుకాణాల్లో దాడులు!

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఔషధ నియంత్రణ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ దాడులను అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో దాడులు నిర్వహించారు. అప్పట్లో ఈ దాడులకు సంబంధించి కూడా అధికారులు గోప్యతను పాటించారు. ప్రస్తుతం ఈ నెల 18న జంగారెడ్డిగూడెంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులకు సంబంధించి మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఇటీవల బుట్టాయగూడెం రోడ్‌లో ఒక మెడికల్ షాపులో కాలంచెల్లిన మందులను గుర్తించారు. అలాగే బుట్టాయగూడెం రోడ్‌లో ఒక ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌పై తనిఖీ చేసేందుకు వెళ్లగా, ఆ ఆర్‌ఎంపీ క్లీనిక్ మూసివేసి వెళ్లిపోయినట్లు సమాచారం. క్లినిక్‌లో అబార్షన్‌లు, ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు తనిఖీలు చేసేందుకు వచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ అధికారులు మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. విలేకరులు అడిగితే మెడికల్‌షాపుల అసోసియేషన్ గ్రూపుల్లో సమాచారం పెట్టామని ముక్తసరిగా అధికారులు సమాచారం ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. అంతేకాక మెడికల్ షాపుల అసోసియేషన్ ప్రతినిధులను వెంటబెట్టుకొని షాపులపై దాడులు చేస్తూ ఉండటంపై అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి. అసోసియేషన్ ప్రతినిధులకు నచ్చని వ్యక్తులపైనే దాడులు చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బేటీ బచావో బేటీ పఢావో

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ఉన్నత పాఠశాలలో శనివారం బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆడ పిల్లలు తప్పకుండా చదువుకోవాలని, అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. సమాజంలో ఆడ పిల్లల పట్ల లింగ వివక్ష చూపరాదన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం గర్భవతికి స్కానింగ్‌లో స్త్రీ, పురుష లింగ నిర్ధారణ చేయడం నేరమని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.